# ఆశాశకురుపు

కొద్దని నేనూ, వొదినా గోలపెడుతున్నా వినక, మా గోలంతా పెడచెవిని పెట్టి, అన్నయ్య ముంచుకుపోయినట్టు పోయినాడు వూరికి. ఆ మధ్యాహ్నం, తన పాటలు వాళ్ళు వింటేనేగాని వాళ్ళకు గతులు లేనట్టు, మేము ముగ్గురమూ శలవలు ఆ పదిరోజులూ యింట్లో చేసిన అల్లరీ, ఆటలూ, పోట్టాటలూ ఎత్తిపొడుపులూ, పాటలూ అన్నీ "ఒక్కసారిగా చల్లబడి. అతను వెళ్ళడంతోటే చప్పున ఆగిపోయి, మేమిద్దరమూ ఒకరి మొహాలు ఒకరం చూసుకోలేక తిట్టుకుంటామా అన్నంత తోచకుండా అయింది మా పని. గది కిటికీదగ్గిర కూచుని రోడ్డుమీద పోయే ప్రతివాళ్ళని వెక్కిరించుకొని, ఆకలేస్తుందనుకొని రెండుసార్లు వుప్మా, కాఫీ చేసుకొని, యెన్నడూలేనిది హటాత్తుగా దుర్గమ్మత్తకి ప్రేమతో ఆరుపేజీల ఉత్తరం వ్రాసి, హార్మోనియంలోంచి, మాలో లేని, సంగీతాన్ని రప్పించలేక దాన్ని విరక్కొట్టి, అన్నయ్య గడియారం ఆలస్యంగా తిరుగుతోందని దాన్నంతా విప్పిపెట్టి-పొద్దు గడిపాం.

మర్నాడు మధ్యాహ్నానికి ఇల్లు తగలబెడదామా, పొరుగింటిదొడ్లోకి రాళ్ళు విసరుదామా, జుట్టు కత్తిరించుకుందామా, అనే ఆలోచనవరకూ వచ్చింది మా స్థితి. పదోసారి గతిలేక ఆ 'శశిరేఖ' మళ్ళా చదువుతూండగా గూటిదగ్గిర కూచున్న వొదిన, 'వొదినా, యిట్లారా తమాషా చూపిస్తా'ననేటప్పటికి నా ప్రాణాలు లేచివొచ్చి, ఆపాడు వెంకటచలం పుస్తకాన్నక్కడ పారేసి, గూటిదగ్గిరికి పరిగెత్తాను. కిటికీకి యెదురుగా ఒక పెద్ద మనిషి నుంచుని వున్నాడు. కళ్ళకి జోడు, జాగ్రత్తగా అర్ధశేరు ఆగరునూనె రాసి దువ్విన గిరజాలూ, షర్టు, మడతవుత్తరీయం అతన్ని చూడగానే నేను వెనక్కి తగ్గాను. తలతిప్పి వొదిన్ని చూసి, అర్థయుక్తంగా చిరునవ్వు నవ్వాడు, వొదిన యేం చేసిందో నాకు కనబళ్ళేదు. కాని అతను మెల్లిగా కిటికీ దగ్గిరికి జరిగాడు. వొదిన చప్పున లోపలికి వొచ్చి కిటికీ తలుపు దబాలున వేసి బిగ్గరగా నవ్వి, వొచ్చి, నవ్వుతో పరుపుమీద నాతో కూడాపడి, గట్టిగా నన్ను కావిలించుకుంది. నా గుండెలు దబదబా కొట్టుకున్నాయి భయంతో యేమిటీ సాహసం! అన్నయ్యతో యింత ప్రేమగా మనసు కలిసివున్న వొదినేనా! నన్నుకూడా యీడుస్తోందేమిటి. ఈ అసహ్యపు వ్యవహారంలోకి?

ఆ వెంకటచలం పుస్తకాల్లోగాని, లోకంలో యిల్లాంటి సంగతులు వుంటాయనుకోలేదు.

"చూశావా?

"యేమిటది?"

"అదే."

"అంటే ?"

"వాణ్ణి చూశావా? ఆ మూతి కాలినవాణ్ణి?"

"మూతి బాగానే వుందే?"

"బాగావుంటే ముద్దెట్టుకో"

"నువ్వాపని చేశావా? చెయ్యబోతున్నావా?"

"నేనా?"

"పోనీ, వాడు!"

"వాడా! వాడి తరమా!"

"మరి ఈ నాటకం యేమిటి?"

"మీ అన్నయ్యవలె నువ్వూ తొందరపడకు, వినుమరి. ఒకరోజున నన్ను కిటికి దగ్గిర చూసి, యీ వెధవ ప్రతిరోజూ ఆ వేళకే యిలాపోవడం వూరికే తొంగి చూడడం, నేను కనబడకపోతే నేను వచ్చిందాకా యెండలోపడి వుండడం ప్రారంభించాడు. మీ అన్నయ్యతో చెపుదామా వొద్దా అని ఆలోచిస్తోవుండగా, ఒకరోజు మధ్యాహ్నం వాడు రాలేదు. ఆవేళ నాకేమీ తోచలేదు. అదిగాక వాడు నన్ను అంత వాంఛతో కోరడం నాకు చాలా గర్వంగా, సంతోషంగా వుంది. వాడిమీద నాకు ప్రేమ వొచ్చిందనుకోకు. ఆ వెధవమీదా? కాని వాడు రావటం అలవాటయింది. చలికాలంలో సాతానివాడూ, రాత్రి మాధాకరంవాడూ అలవాటైనట్టే. ఇంతలో యేం పోయింది? ఇంతమాత్రం తమాషా లేకుండా బతకడంమెలా? మొగాళ్ళ కెన్నో తమాషాలుంటాయి జీవితంలో, క్లబ్బులూ, ఆటలూ, పార్టీలూ, షికార్లూ! మనకేముంది? వంటా, చాకిరీ, చచ్చు పేరంటాలూ! పొద్దున్నా, రాత్రీ యింతే! వాళ్ళకేం? ఎంతమంది ఆడవాళ్ళని చూస్తారో, మనకేం తెలుసు? కాస్త మొగాళ్ళకేసి చూస్తే మనకి తిట్లు. మనమూ మనుషులమేనా? ఏనా తప్పేం చేశాను? నా చంపల్నో, జుట్టునోచూసి, వాడు ముగ్ధుడై గంటలకొద్దీ రోడ్డుమీద పడివుంటే యెవరికేం కష్టం? వాడికంటావా? కష్టంగానే వుంటే ఎండ నెత్తిమీద మాడుతూ యెందుకు నుంచుంటాడు? వాడికీ ఆనందమే! అపాయంలేని వాడి ఆనందాన్ని మన యెందుకు చెడగొట్టాలి? ఆనందమివ్వడం పుణ్యకార్యమా కాదా? ఈ సంగతి మొగాళ్ళకి అర్థంకాదు! నా జుట్టు అందం వంక మీరు చూడనే చూడరు. కాని ఆ జుట్టుని ఒక్కసారి చూడ్డానికి ఒక పెద్దమనిసి అరగంట యెండలో మాడుతూ నుంచున్నాడు, మీ భార్యనైన నా అందం చాలామంది మెచ్చుకుంటున్నారంటే, మీ అన్నయ్య యే మాత్రం సంతోషిస్తారు? పోనీ ఆయన నా అందాన్ని మెచ్చుకుంటారా? నా అందం ఆయనకిమామూలు, ఆకాశం నీలంమల్లే, గడ్డి పచ్చదనంమల్లే! పోనీ యింకోకరు మెచ్చుకుంటే సంతోషిస్తారా? ఏదీ లేదు. మామూలుగా రాత్రి పదింటికి పక్కన పడుకుని మూసిన కళ్ళు తెల్లవారిందాక తెరవరు. అర్థరాత్రి నిద్రలేపి "ఏమండీ వాడిందాకా నా కళ్ళ అందాన్ని చూసి చూసి మురిశాడు, ఆ కళ్ళు తనని చూసేవాళ్ళు లేక రాత్రంతా



/A

యేడుస్తున్నాయి' అంటే యేమంటారు ? అంతేకాదు, నేను యాడాది పుట్టింట్లో వుంటే, హొటలుభోజనం వొంటికి పడడంలేదు, వెంటనే రమ్మని వ్రాశారుగాని నా పెదిమల అందం కనపట్టంలేదని కాని, నా చెంపల నునుపు ఆయన్ని విరహంలో ముంచిందని వ్రాశారా? అంతగా ఐతే మహా, నువ్వు దగ్గిరలేకపోతే కష్టంగా వుంది అంటారు. అంటే మన మర్థం చేసుకోవాలి, ఆ కష్టమేమిటో కనక మనకి పెదిమలు, కళ్ళూ వున్నాయనీ, వాటికో అందం యేడిసిందనీ, ఎంత త్వరలో మరచిపోతే అంత మంచిది. నీ నేత్రాలు భ్రమరాలమల్లే వున్నాయనడం లేనేలేదు కదా, పైగా 'నీకు కళ్ళు కనపట్టంలేదు, గుడ్లు మీది కొచ్చినట్టున్నాయి' అంటారు. మీ అన్నయ్యకి ప్రేమలేదని కాదు. వుంది కాని యివన్నీ చూడదా ప్రేమ. ఇలాంటి కిటికీల పెద్దమనుష్యులే మన సౌందర్యాన్ని గుర్తించి మనకి ఆనందం కలుగచేసేది. వీళ్ళని వొదులుకుంటే జీవితానికి మెరుగేదీ? ఇంతవరకూ వాడికి నేను యిచ్చిందల్లా కొలుకుల్లోంచి అప్పుడప్పుడు ఒక్కచూపు. దానికోసం కుక్కవలె అలా గుమ్మంలో పడివుంటాడు. ఇంత చవకగా పహరావాణ్ని సంపాయించగలవా యింకో విధంగా!'' అంది.

నా మనస్సు సమాధాన పడలేదు. అనుభవం తక్కువ కావడం చేతనేమో.

తప్పుకదూ, వాడిమీద మనస్సు వుంటే నీకు అనుకోవచ్చు. కన్నుతో వేలుతో అతడ్ని కోతి నాడించినట్టు ఆడిస్తున్నావే.''

“అదీ తప్పే?''

“పాపం ఆయన కెలావుంటుంది? యెంత ఆశా మోహమూ లేకపోతే యిలా పనులన్నీ చెరుపుకొని నీ చుట్టూ తిరుగుతాడు? వాణ్ని సంతుష్టిచేసే వుద్దేశం లేని దానివి యెందుకతని కా ఆశ కల్పించడం?''

“పరస్త్రీని కోరేవాడు మరి తిప్పలు పడవద్దూ?''

“అన్నయ్యతోచెప్పి తన్నించు. కాని అన్యాయంగా యీ దొంగ ఆశ లెందుకు!''

“చాలదు. యీ శిక్షతో సమానమయింది లేదు.''

వొదిన ముందన్న మాటలకి యీ మాటలకి విరుద్ధం కనబడ్డది. కాని, యెలా అడగాలో తెలియక వూరుకున్నాను.

“చూడు మళ్ళీ వచ్చాడు వీడు వెళ్ళిపోతే యీ రోజంత యేం తోస్తుంది మనకి?''

“సంగీతం వచ్చేమో పాడిద్దాం. మొగ్గలు వెయ్యగలడేమో ! అన్నయ్య కోప్పడకుండా ఆ గడియారం బిగించి పెట్టటం చాతనవుతుందేమో!''

“వుండు ఒక తమాషా చేస్తాను'' అని కిటికీ దగ్గిరికి వెళ్ళింది.

“రాత్రి దొడ్లో పాకదగ్గిరకు రండి, యెంత ఆలస్యమైన నేను వొచ్చిందాకా అక్కడే వుండండి'' అంది.

అతని సంతోషం చూస్తే ఆ రోడ్డుమీదే రెండు మూడు పల్టీలు కొట్టి ఒక యెంకిపాట పాడతాడనుకున్నాను. కాని వొదిన సాహసం చూస్తే నాకు భయమేసింది.

"యేమిటిది?"

"నువ్వూరుకో !"

మొత్తానికి తోచకుండావుండడం పోయింది. వొదిన చప్పుచప్పున వంటచేసింది. వొదిన సంభ్రమంచూస్తే మాత్రం నాకు భయంగా వుంది. వాడితో యెంతవరకు చనువు తీసుకొంటుందో, నేనేం చెయ్యాలి? యెలా అభ్యంతరం పెట్టను? అన్నయ్యేమంటాడు? వాడు ఆమెని వొదిలి నన్ను-

సాయంత్రమే మంచి వెన్నెల వొచ్చేసింది. కాని అపరిమితమైన చలి ప్రారంభించింది. వంటింటి కిటికీకి తడికకట్టి దాని వెనక యిద్దరమూ కూచున్నాము. సందులోనుంచి గోడమీదికి మెల్లిగా వొచ్చి యిటు అటు చూసి గుమ్మం వంక ఒక్క నిమిషం చూసి పాకలో దూరాడు. నేను, భయమూ కనికరమూ మరిచిపోయినాను. వొదిన వుత్సాహంతోపాటు నాకు అల్లరితనం పుట్టుకొస్తోంది. లోపల లోపల నవ్వుతో, చప్పుడు లేకుండా చప్పట్లు కొడుతూ కూచున్నాను. దొడ్డి నిశ్శబ్దమయింది. మే మిద్దరంపోయి పడుకున్నాము.

"యేంచేద్దాం?" అన్నాను.

"నిద్రపోదాం."

"వాడూ?"

"అంతే. వుండనీ, ఒక్కనిమిషం పడుకుందాం?"

యేదో దొడ్లో పెద్దతమాషా జరుగుతున్నట్లు వొదిన నిమిషానికోసారి దొడ్లోకి పరిగెత్తడం, వీలైతే నన్ను కూడా లాక్కుపోవడం, వొచ్చి మళ్ళీపడుకోడం. కాని యేమీ జరగంది, ఆ వుత్సాహం తనలో తానెంతసేపు కల్పించుకోగలదు? పదింటికి కళ్ళు మూసుకున్నాము. కాని నాకు నిద్రరాదు. ఆ పాకనిండా పురుగులు, పేడకంపు, వొణుకెత్తించే ఆ చలిలో యెలా కూచున్నాడో ఆ మహానుభావుడు? ఆ ఆవు వెనక నక్కాడుగావును, యీ చలికి! ఆ ఆవుకి జబ్బు, మూలుగుతుందికద అనుకుని ఆపడానికి వీల్లేకుండా నవ్వాను.

"సరే వాడి గతేమిటి?"

"చావనీ"

మళ్ళీ ఆలోచించాను. పాపం యెంత ఆశతో మేలుకొని కూచున్నాడో? పోనీ నేను వెళ్ళిపొమ్మంటే? ఒదిన నన్ను వెళ్ళనిస్తుందా? పోనీ ఒదిన నిద్రపోయింతరువాత వెళ్ళి

చెపితే? వాడు నన్ను ఒదిన అనుకుంటే? ఇట్లా ఆలోచిస్తూ నిద్రపోయినాను.

పన్నెండింటికిగావును, వొదిన నన్ను లేపి తమాషా చూపిస్తానని లాక్కెళ్ళింది. దొడ్డితలుపు దగ్గిరికి గబగబా నడిచి గడియ తీస్తున్నట్టే చప్పుడు చేసింది వాడు చప్పున లోపల్నించి వెన్నెట్లోకి దూకాడు మళ్ళీ ఆగింది. ఎదురుచూసి పక్కదొడ్లోకిచూసి లోపలికి వెళ్ళాడు. మళ్ళీ చప్పుడు చేసింది. మళ్ళీ బైటికి దూకాడు. వొచ్చి మళ్ళీ పడుకున్నాం."

"ఇప్పుడన్నా పంపించెయ్యి."

"అలాకాదు, నువ్వు కిటికీదగ్గిరికవెళ్ళి తిట్టు" అంది, నేను ఒప్పుకోలేదు, చివరికి తనేవెళ్ళి గడియ చప్పుడుచేసి బైటకిరప్పించి వాణ్ణి కిటికీ దూరంగా నుంచొని మారు గొంతుకతో,

"యెవరది," అని,

పాడుతిట్లన్నీ ప్రారంభించింది. వాడు పాకలో దూరాడు. మళ్ళీ నిద్రపోయినాను నేను. రెండుగంటలప్పుడు తలదగ్గిర కిటికీ చప్పుడై లేచి చూశాను. వెన్నెట్లో సందులో నుంచుని వున్నాడు. భయమేసింది. కడ్డీలూడబెరికి రాడుకద! నన్నుచూసి ఒదినని లేపమని సౌంజ్ఞలు చేశాడు. నా భయంచూసి ఒదినలేచి పకపక నవ్వింది. వాడు దొడ్డివేపు వెళ్ళాడు.

తెల్లారి లేచికూడా దొడ్లోకి వెళ్ళడమంటే భయమేసింది. పాలన్నా పితకలేదు ఆవుకి. ఒదిన వాకిట్లో ముగ్గుపెడుతోంది. వీధంతా ప్రతీగుమ్మంలో గొబ్బెమ్మలు పెడుతున్నారు. నేను వసారాలోనుంచునిచూస్తున్నాను. ముసుకేసుకుని మెల్లిగా ఒకడు వీధివెంబడి వస్తున్నాడు. మా యింటి కెదురుగా రాగానే ఆగి ఒదిన పక్కన నిలబడ్డాడు. అన్నయ్యేమో నన్నుకున్నాను. ఒంగుని ముగ్గుపెడుతున్న వొదిన చప్పున నుంచుంది. తటాలున ఒదిన్ని కావిలించుకుని గట్టిగా కదలకుండా పట్టుకుని, ఆదుముకుని బుగ్గమీద కొరికి, ఒదిలి గబగబ వెళ్ళిపోయినాడు. ఒదిన 'అబ్బా' అని అణుచుకొని అరిచి, లోపలికి వచ్చేసింది. నేను గడియ పెట్టాను. వాడిపళ్ళు రెండువరసలూ దిగబడ్డాయి పాపం. పట్టీలు తగిలించి కట్టుకట్టాము కొంచెం నయంగా వుండగా అన్నయ్య వచ్చాడు.

"ఇదేమి"టన్నాడు.

నేను నవ్వుతో "అందరికీ కంటి మీదలేస్తే ఒదినకి దవడమీద లేచింది ఆశాకురుపు" అన్నాను.

వూళ్ళో పుకారుగా వుంది. ఒదిన పుట్టింటికి వెళ్ళింది.

◆ ◆ ◆

*ప్రచురణ : (అదృష్టం కథల సంపుటి) ప్రేమ్‌చంద్ పబ్లిషర్స్, పునర్ముద్రణ* ***1964***